# నేను దొరగార్ని

నేను ఇప్పుడు దొరగార్ని!

నాకింద ఇద్దరు ప్యూనులు. ఒకపంకా లాగే కుర్రాడు, ఇద్దరు గుమాస్తాలూ, ఉన్నారు. నా గుమస్తాల కోసం ఆఫీసు వేరేఉన్నా నా ఆఫీసు ఇంట్లో పెట్టుకున్నాను. నౌకర్లు రెండు పూట్లా టపాల్సు ఇంటికి తెచ్చి, తీసుకు పోతుంటారు.

గుమస్తాలు అనుమానం కల్గినప్పుడు నాదగ్గిరకే వస్తుంటారు. ప్యూనులిద్దరూ నాదగ్గిరే వుంటారు. అంటే ఒకడు నాగదిలో వుండి ఆఫీసు కాగితములు అవీ చూస్తుంటాడు. మరొకడు ఇంట్లోపని, తోటపెంచడం, కూరల మొక్కలు పెంచడం మొదలైనవి చేస్తుంటాడు. కుర్రాడి పని పిల్లల్ని ఆడించడం.

గుమస్తాలు అప్పుడప్పుడు సణుక్కోడం విన్నాను. "అంతమందినీ ఇంటి దగ్గరే పెట్టు కుంటాడు" అని. ఆసమయంలో వాళ్ళు 'నేను దొరగార్ని' అనేవిషయం మర్చిపోతారను కుంటాను. వచ్చిన ఖర్మ మేమిటంటే నేనూకిందనించే పైకివచ్చాను. వాళ్ళ కష్ట నిష్ఠూరాలు నాకు తెల్సు. నాకూ గుమస్తాగావున్నప్పుడు దొర్ల ప్రవర్తన అసహ్యంగానూ, బాధగానూ ఉండేది. కాని ప్రభుత్వ ధర్మము అని నేనుఇప్పుడిప్పుడు వాళ్ళ ఆఫీసరుల బలాన్ని తెల్సుకోగలుగు తున్నాను. ప్రభువు చిరకాలం కాదు– ప్రభుత్వం చిరకాలం వర్థిల్లు.

ఇంకో విషయం! నేను గుమస్తాగా వున్నప్పుడు నెలకి ప్రత్యేకం పది రూపాయలు ఏపువ్వులకో, కూరలకో ఖర్చయి తీరేవి. ఇప్పటి నాగుమాస్తాలూ అంతే! డబ్బు వృధాగా ఖర్చు చేస్తున్నారు.

ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం కాయగూరలూ, పువ్వులు ఇంట్లోనే పండించుకొని ఆ మిగిలిన డబ్బుతో నేషనల్ సేవింగ్సు సర్టిఫికెట్సు ద్వారా నాభావిని, పిల్లల భావిని, రక్షించడమే కాకుండా, ప్రభుత్వానికి ఉడతా భక్తితోడ్పడ గలుగుతున్నందుకు నన్ను నేను అభినందించుకోవల్సి వొస్తుంది.

అదే గుమాస్తాలకు చెబుతాను. "డబ్బు అనవసరంగా ఖర్చు చెయ్యకండి. అధికా హారోత్పత్తికి తోడ్పడండి" అని. వాళ్ళు వింటేగా!

గుమస్తాలకి ఏదో డబ్బు ఆశలుంటాయి! డబ్బు లేనప్పుడు ఎన్నో కోరికలు! ఎక్కువ డబ్బు సంపాయించు కుంటే ఎక్కువ ఖర్చు పెట్టి సుఖపడొచ్చునని.

కాని అది అబద్ధం! దానికి నా ఉదాహరణచాలు. ఎందుకంటే నాకు ఈమధ్య ఖర్చంటే అసలిష్టం లేకుండాపోయింది. తెలివి తక్కువ కాకపోతే బ్యాంకుల ఎకౌంట్స్లేవాలి. నిజమైన సుఖం తాత్కాలికమైన సుఖం ఖర్చుతో కూడినదేం లాభం?

ఇప్పుడు నేనో కారుకొన్నాను. దానికి డ్రైవరు కావాలి. టి.ఎ.బిల్లులు, పెట్రోలు ఖర్చులకి రావొచ్చు. కాని డ్రైవరు నెవరు భరిస్తారు? అందుకే ఒక ప్యూనుని తీసి, డ్రైవింగ్ తెల్సినవాడ్ని ఒక ప్యూనుకింద వేశాను. అదీ తెలివి! కాని పోతున్నవాడు అనవసరంగా తొలగించానని ఏడ్పు! ఎద్దుపుండు కాకికేం? వాడికేం తెలుస్తుంది నా అవసరం.

స్వతంత్ర ప్రభుత్వంలో మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తారనుకున్నారు చాలామంది. కాని నిజం నాకెప్పుడో తెల్సు. మేము విదేశ ప్రభుత్వం క్రింద అణకువకలిగిన నౌఖర్లం; ఈ ప్రభుత్వానికి విశ్వాసపాత్రుల మయ్యాము.

గుమస్తాగా ఉన్నప్పుడు మాయింటికి చాలామంది చుట్టాలొచ్చేవారు. అప్పుడు అందరిన్నీ గౌరవించి పంపేవాణ్ణి. ఇప్పుడు నా హోదాచూసి ఇంకా రాసాగారు. కాని నేను వాళ్ళ ఆటలు సాగనిస్తానా? 'తేరగా మెయ్యడానికి' నేనేం వెర్రివాడ్ననుకొన్నారు గావును.

ఆఫీసు గదిలోనే పలకరించి "ఉహు! నువ్వా? ఎందుకొచ్చావ్? పనిలేకపోతేసరి? సరే! ఒరేయి! ఆ కాగితాలు ఇల్లా తీసుకురా! ఇవి పోస్టులో వెయ్యి, గుమాస్తాని రమ్మను. అబ్బ! వెధవపని! ఎక్కడా తీరికలేదు" అని మాట్లాడేసరికి వాళ్ళు మళ్ళీ గుమ్మంతొక్కడం మానేశారు.

ఈ లోకంలో మనిషికి కావల్సింది మెదడు. మెదడంతే!

*06.11.1949–ఆనందవాణి వార పత్రిక*